ఇసుక టిప్పర్ల పట్టివేత

బిచ్కుంద, సెప్టెంబరు 15: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ఇసుక టిప్పర్లలో ఒకదాని గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మంజీరా పరివాహక ప్రాంతాల నుంచి టిప్పర్ లారీలలో ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు హైవేవద్ద పరిశీలించగా ఒక లారీలో తరలిస్తున్న ఇసుకను గుర్తించామని తెలిపారు. పట్టుబడిన టిప్పర్ లారీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



జోరుగా.. ఇసుక అక్రమ రవాణా!

పోతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా తరలిస్తున్న ఐదు ఇసుక టిప్పర్‌లను పట్టుకున్న పోలీసులు

- మంజీరాను కొల్లగొడుతున్న అక్రమార్కులు
- ఇసుక రీచ్‌లు రద్దయినా గుట్టుగా తవ్వకాలు
- రాత్రుల్లో ఇసుక తవ్వి శివారు గుట్టల ప్రాంతాల్లో భారీగా డంపులు
- హస్గుల్, షెట్లూర్, ఖడ్గవ్ మంజీరాలో భారీగా ఇసుక తవ్వకాలు
- పోతంగల్, మంజీరా నుంచి భారీ టిప్పర్‌ల ద్వారా బిచ్కుంద మీదుగా ఇసుక తరలింపు
- స్థానిక నేతలు, అధికారుల అండదండలతోనే ఇసుక అక్రమ రవాణా
- మైనింగ్‌శాఖ జరిమానాలు విధిస్తున్నా ఆగని దందా
- ఇటీవల కాలంలో మంజీరా పరివాహక ప్రాంతాల్లో భారీగా ఇసుక డంపుల సీజ్

కామారెడ్డి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా దందా ఆగడం లేదు. మంజీరా నదితో పాటు జిల్లాలోని పలు వాగులు, వంకలు, నదుల్లోంచి ఇసుకాసురులు ఇసుకను తోడేళ్లలా తవ్వేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. ప్రధానంగా మంజీరా నదిలోంచి ఇసుకను తవ్వేస్తూ అక్రమంగా కోట్లాది రూపాయల ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. బీర్కూర్, బిచ్కుంద మంజీరాలో ఇసుక రీచ్‌లు మూసివేసినప్పటికీ ఇసుక అక్రమ రవాణా మాత్రం సాగుతునే ఉంది. క్వారీల పేరిట కొందరు ఇసుకాసురుల్లు ట్రాక్టర్‌లు, భారీ లారీలు, టిప్పర్‌లతో గుట్టుగా హైదారాబాద్, మహారాష్ట్ర లాంటి మహానగరాలకు తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. స్థానిక నేతలు, అధికారుల అండదండలతోనే ఇసుకను కొల్లగొడుతున్నారంటూ స్థానిక ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంజీరా నదిలో వరద ప్రవహిస్తున్నప్పటికీ ఇసుకాసురులు బరితెగించి ఇసుకను తరలిస్తున్నారు. ఓ వైపు మైనింగ్, పోలీస్‌శాఖ అధికారులు తనిఖీలు చేస్తూ ఇసుక లారీలను, ట్రాక్టర్లను పట్టుకుని జరిమానా విధిస్తున్నారు. ఇటీవల కాలంలో మైనింగ్, పోలీసుల, రెవెన్యూ అధికారులు ఇసుక డంపులను పెద్ద మొత్తంలో సీజ్ చేశారంటే ఏ స్థాయిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందో తెలుస్తోంది.

ఇసుక తవ్వకాలు రద్దయినా ఆగని అక్రమ రవాణా

జిల్లాలోని మంజీరా నది పరివాహక ప్రాంతంలో లక్షల టన్నుల ఇసుక అక్రమ విక్రయాలపై ప్రభుత్వం ఇటీవల కొరడా ఝులిపించింది. ఇసుక క్వారీల కాంట్రాక్టర్‌లు, టీజీఎండీసీ సిబ్బంది కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి కోట్ల రూపాయలు దండుకున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు క్వారీల్లో తవ్వకాలను నిలిపి వేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో బిచ్కుంద, బీర్కూర్ మంజీరా పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు గత ప్రభుత్వంలో అనుమతులు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల 2,3 క్వారీల్లో తవ్వకాలకు టీజీఎండీసీ అనుమతి ఇచ్చింది. ఈ తవ్వకాల్లో కాంట్రాక్టర్‌లు భారీగా అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో ఆ క్వారీల అనుమతులు రద్దుచేసి తవ్వకాలు నిలిపివే యాలని ప్రభుత్వం మూడు నెలల క్రితం ఆదేశాలు జారీ చేసింది.

మంజీరాను కొల్లగొడుతున్నారు

జిల్లాలో నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూర్ మండలాల మీదుగా మంజీరా ఉంది. ఈ మంజీరా నదిలో చాలానే ఇసుక క్వారీలు ఉండేవి. గతంలో ఈ క్వారీల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలతో ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కేవలం ప్రభుత్వ పథకాల నిర్మాణాలకు మాత్రమే ఇసుక తవ్వకాలు అనుమతించారు. మంజీరా నదిలో ప్రభుత్వ అభివృద్ధి పనుల పేరిట అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. ఇలా కొన్ని రోజుల పాటు మంజీరాలో ఎలాంటి ఇసుక తవ్వకాలు జరుగలేదు. అయితే ఇటీవల భారీ వర్షాలు కురువడంతో మంజీరాలోకి భారీగానే వరద పోటెత్తింది. నదిలో నీటి ప్రవాహం ఉన్నప్పటికీ ఇసుకాసురులు బరితెగుస్తూ రాత్రుల్లో గుట్టుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ప్రధానంగా బిచ్కుంద మండల పరిధిలోని హస్గుల్, షెట్లూర్, ఖడ్గవ్ మంజీరాలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ శివారు గుట్టల ప్రాంతాల్లో గుట్టుగా డంపులు చేస్తున్నారు. పగలు భారీ టిప్పర్‌లలో ఆ ఇసుకను నింపి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇటీవల గోపన్‌పల్లి గుట్టల్లో 18 ఇసుక ట్రాక్టర్ల డంపులు రెవెన్యూ సీజ్ చేసింది.

పోతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా..

జిల్లా సరిహద్దు అయిన పొరుగు జిల్లాకు చెందిన కోటగిరి మండలం పోతంగల్ మంజీరా నదిలో స్థానికంగా ఉండే కొందరు చోటామోటా నాయకులు అక్రమంగా ఇసుకను తవ్వుతూ స్థానికంగా భారీగా డంపులు ఏర్పాటు చేస్తున్నారు. పగలు కాగానే భారీ టిప్పర్‌లు, లారీల ద్వారా మంజీరా నది గుండా బీర్కూర్, బిచ్కుంద మీదుగా తరలిస్తున్నారు. బిచ్కుంద మండల కేంద్రం మీదుగా జాతీయ రహదారి ఉండడంతో గుట్టుగా పోతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా ఇసుక లారీలను జాతీయ రహదారిపైకి ఎక్కించి హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటకలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బిచ్కుంద మీదుగా భారీ ఇసుక టిప్పర్‌లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఆదివారం పోతంగల్ నుంచి బిచ్కుంద మీదుగా వెళ్తున్న ఐదు ఇసుక టిప్పర్‌లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు.

కేసులు పెడుతున్నా ఆగని దందా

ఇసుక అక్రమ రవాణాకు జిల్లా మైనింగ్ శాఖతో పాటు పోలీస్‌శాఖ ఎడాపెడ కేసులు పెడుతున్నా ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. ప్రతిరోజూ జిల్లాలో ఏదో ఒకచోట పోలీసులు కాని, మైనింగ్ అధికారులు కాని ఇసుక ట్రాక్టర్‌లను, లారీలను పట్టుకోవడమే ఇసుక అక్రమ రవాణాకు నిదర్శనం. ఇటీవల కాలంలో మైనింగ్‌శాఖ అధికారులు 5కుపైగా ఇసుక, ఇటుక, మొరం వంటి అక్రమ కేసులను నమోదు చేశారు. ఇందులో అధిక మొత్తంలో ఇసుక అక్రమ రవాణా కేసులే ఉన్నట్లు మైనింగ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్‌లపై విధించిన జరిమానా విధిస్తున్నారు. ఇలా జిల్లాలో అధిక లోడ్, అక్రమ ఇసుక రవాణా కేసులు పెద్ద మొత్తంలో నమోదు అవుతుండటంతో ఏ స్థాయిలో అక్రమ ఇసుక రవాణా జరుగుతుందో ఇట్టే తెలుస్తోంది. కొన్ని శాఖలు ఇసుక అక్రమ రవాణపై నిఘా పెడుతుంటే మరికొన్ని శాఖల వారు ఇసుకాసురులకు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటున్నాం

● నగేష్, జిల్లా మైనింగ్‌శాఖ అధికారి

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకు ంటున్నాం. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా కూడా ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. ఇటీవల ప్రభుత్వం మంజీరాలో ఇసు క తవ్వకాలను రద్దు చేసింది. మంజీరా నుంచి ఇసుక అక్ర మ రవాణా సాగుతుందని మా దృష్టికి వచ్చింది. అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఇటీవలకాలం లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు కేసులు నమోదు చేశాం. కేసులతో పాటు వాహనాలు సీజ్, భారీగా జరిమానాలు విధిస్తున్నాం.

బీర్కూర్‌లో తాగునీటి కటకట


బీర్కూర్‌లో వాటర్ ట్యాంకు ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బీర్కూర్, సెప్టెంబరు 15 : మండల కేంద్రంలో తాగునీటి సమస్య తాండవం చేస్తోంది. తాగునీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. బీర్కూర్ గ్రామంలోని కుమ్మరి గల్లీ, వైఎస్ఆర్ కాలనీల్లో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంది. తాగునీటి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కుమ్మరిగల్లి, వైఎస్ఆర్ కాలనీలకు చెందిన మహిళలు తమతమ కాలనీల్లోని వాటర్ ట్యాంకుల ఎదుట బైటాయించి ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీల మహిళలు మాట్లాడుతూ గత పది, పదిహేను రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు కుళాయిల ద్వారా సరఫరా కావడం లేదన్నారు. ప్రతిరోజూ నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. వ్యవసాయ బోరు మోటార్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. స్నానాలు చేయడానికి, బోళ్లు కడగటానికి, వంట చేయడానికి, బట్టలు ఉతకడానికి, కాలకృత్యాలు తీర్చుకోడానికి నీరు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు లేక పిల్లలు స్నానం చేయడం లేదని, స్కూల్‌కు వెళ్లడం లేదన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా జీపీ కార్యదర్శి గంగారాం అక్కడికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. సక్రమంగా నీరు సరఫరా చేస్తామని హామీనిచ్చారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్ వాల్ పగిలిపోయిందన్నారు. వాల్‌కు మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రేపటి లోగా కుళాయిలు ద్వారా నీరు సరఫరా చేస్తామని చెప్పడంతో మహిళలు శాంతించి ఇంటికి తిరిగి వెళ్లారు.


హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఆదివారం పదవి బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

గణేష్ నిమజ్జన శోభాయాత్రకు సర్వం సిద్ధం

- 9 రోజులు ఘనంగా పూజలు అందుకున్న వినాయకులు
- నేడు సాయంత్రం ఇందిరాచౌక్ నుంచి ప్రారంభంకానున్న శోభాయాత్ర
- విశ్వహిందూ పరిషత్, గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 15: కామారెడ్డి జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గణేష్ నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పోలీస్‌శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి పాత బస్టాండ్‌లోని సిరిసిల్లా రోడ్డులో గల ధర్మశాల నుంచి శోభాయాత్ర ప్రారంభం కానుంది. గత 9 రోజులుగా భక్తులతో పూజలందుకున్న గణనాథుడు నిమజ్జనానికి తరలివెళ్లనున్నారు. సోమవారం సాయంత్రం కామారెడ్డిలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రారంభం కానుంది. సిరిసిల్లా రోడ్డు నుంచి స్టేషన్‌రోడ్డు, సుభాష్‌రోడ్డు, పంచ్‌చౌరస్తా, గోపాలస్వామి రోడ్డు మీదుగా పెద్దబజార్, కమాన్, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ రోడ్డు మీదుగా టేక్రియాల్ సమీపంలోని పెద్ద చెరువులో మంగళవారం గణేష్ నిమజ్జనాలు జరుగనున్నాయి. గణేష్ శోభాయాత్రను తిలకించేందుకు కామారెడ్డి జిల్లా కేంద్ర ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున భారీ గణనాథులు కొలువుదీరి ఉన్నాయి. జిల్లా ఎస్పీ సింధూశర్మ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రకు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాట్లు చేయనున్నారు. అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారులు, వివిధ కాలనీలో ఉన్న అన్ని సీసీ కెమెరాలను పోలీసుస్టేషన్‌కు, పోలీసు కంట్రోల్ రూంకు అనుసంధానించి శోభాయాత్రను పర్యవేక్షించే విధంగా పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. విశ్వహిందు పరిషత్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాత బస్టాండ్‌లోని ఇందిరాచౌక్ వద్ద గణేష్ శోభాయాత్రకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు టేక్రియల్ సమీపంలోని చెరువులో గణేష్ నిమజ్జన కార్యక్రమం కొనసాగనుంది. చెరువు వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు భారీ కేడ్లన్లు ఏర్పాటు చేసి క్రేన్‌ల సహాయంతో చెరువులో నిమజ్జనం చేసేందుకు మున్సిపల్ శాఖ అధికారులు ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. భద్రతాపరమైన అంశాలలో ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీసు అధికారి పర్యవేక్షణలో బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. ఇక వీరితో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బందోబస్తులో సేవలు అందించనున్నారు.

ప్రజలను ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహాలు, అలంకరణలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయకులు, అందంగా మండపాలు ఏర్పాటు చేయడంతో ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. వినాయకులను చూసేందుకు వస్తున్న ప్రజలతో కిక్కిరిసిపోతోంది. ప్రతీ వార్డుకు 10కి పైగా పెద్ద ఎత్తున వినాయకులు ఏర్పాటు చేశారు. సిరిసిల్లా రోడ్డు, గాంధీగంజ్, భారత్‌రోడ్డు, పెద్ద బజార్, గొల్లవాడ తదితర ప్రాంతాల్లో భారీ విగ్రహాలు ఏర్పాటు చేయడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ప్రతీ ఏటా గొల్లవాడ ప్రాంతంలో వినూత్న గణనాథులను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి గవ్వల గణపతితో పాటు 1101 మట్టి వినాయకులను ఏర్పాటు చేయడంతో భారీ ఎత్తున ప్రజలు తరలివెళ్తున్నారు. గత 9 రోజుల నుంచి వినాయకులు ఘనంగా పూజలు అందుకున్నాయి. ఇప్పటికే పలుచోట్ల వినాయకుల విగ్రహాలు గంగమ్మ చెంతకు చేరుతున్నాయి. రాష్ట్రంలోనే హైదరాబాద్ తర్వాత పెద్ద ఎత్తున గణేష్ నిమజ్జన ఉత్సవాలు కామారెడ్డిలో జరుగుతుంటాయి. ఈ ఉత్సవాలను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తుండడంతో పోలీసులు సైతం అప్రమత్తమై నిఘాను పెంచారు.


చెరువు వద్ద ఏర్పాట్లు చేసిన మున్సిపల్ సిబ్బంది

నిమజ్జనానికి పోలీసుల సూచనలు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రారంభం కానున్న గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునే విధంగా వినాయక మండపాల నిర్వాహకులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ సింధూ శర్మ కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు కింద సూచనలను పాటించాలని కోరారు.

- కామారెడ్డి జిల్లా ప్రజలు శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిమజ్జన శోభాయాత్రను నిర్వహించుకోవాలి.
- వినాయక మండపాల నిర్వాహకులు వినాయక విగ్రహాలను తీసుకెళ్లేందుకు కండీషన్‌లో ఉన్న వాహనాలను మాత్రమే శోభాయాత్రకు వినియోగించాలని కోరారు. మండే పదార్థాలు అనగా పెట్రోల్, డీజిల్‌ను పెట్టరాదు. ఆధ్యాత్మిక వాతావరణం తలపించే శోభాయాత్ర జరగాలని ఎవరు కూడా మద్యం తాగి శోభాయాత్రలో పాల్గొనకూడదని తెలిపారు.
- వాహనంలో అనుమానాస్పద వ్యక్తులు, చిన్నారులను నిమజ్జన ప్రాంతాలకు తీసుకురాకూడదు. ఎటువంటి అభ్యంతరకరమైన వస్తువులను వాహనంలోకి రాకుండా చూసుకోవాలి.
- రౌడీ షీటర్లతో పాటు క్రిమినల్ రికార్డు ఉన్న వారిపై, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టడం జరిగిందని తెలిపారు. ఊరేగింపులో ఎవరు కూడా కర్రలు, తల్వార్‌లు, కత్తులు వంటి ఇతర మరణాయుధాలు ఉండరాదు.
- కరెంట్ వైర్లు వాహనంకు కానీ, విగ్రహంకు కానీ తగలకుండా జాగ్రత్త పడాలి
- నిమజ్జనం ప్రాంతంలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయడం జరిగింది.
- మండపాల నిర్వాహకులు వారికి కేటాయించిన నెంబర్ల ప్రకారం శోభాయాత్రలో పాల్గొనాలి
- ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలి.



పీఆర్‌టీయూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 15: పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా రెండో సారి పొద్దుటూరి మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని బస్వాగార్డెన్‌లో నిర్వహించిన పీఆర్‌టీయూ జిల్లా సర్వసభ్య సమావేశం అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, ఆర్మూర్‌కు చెందిన ఎన్.వి. కృష్ణారెడ్డిలు నామినేషన్‌లు దాఖలు చేయగా ప్రధాన కార్యదర్శి కోసం ప్రస్తుత ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, జి.కిషన్, ఎం బెల్లి శంకర్‌లు నామినేషన్‌లు దాఖలు చేయగా మధ్యాహ్నం ఓటింగ్ నిర్వహించారు. ఉదయం నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ భట్టాపురం మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావులు హాజరయ్యారు. 195 ఓట్లకు గాను 188 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి ఎన్.వి. కృష్ణారెడ్డి చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేయగా గతంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న మోహన్‌రెడ్డి వైపే మెజార్టీ ఉపాధ్యాయులు మొగ్గు చూపడంతో ఆయన వరుసగా రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మూడేళ్లుగా అధ్యక్షుడిగా ఆయన ఉపాధ్యాయుల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఉపాధ్యాయుల అనేక సమస్యలను పరిష్కరించడంలో కృషి చేయడంతో ఉపాధ్యాయులంతా ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులలో ఆయన ఉపాధ్యాయుల పక్షాన నిలబడ్డాడు. 317 జీవో వల్ల నష్టపోయిన చాలా మంది ఉపాధ్యాయులకు, పదోన్నతులలో తప్పులు దొర్లిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేశారు. అధ్యక్ష పదవికి పోటీ నామమాత్రంగానే అయినప్పటికీ ప్రధాన కార్యదర్శి పదవికి మాత్రం తీవ్ర పోటీ నెలకొంది. ప్రధాన కార్యదర్శి పదవి కోసం ముగ్గురు పోటీ పడగా చివరకు నందిపేటకు చెందిన గంగోనే కిషన్ ప్రధాన కార్యదర్శి గెలుపొందారు. కాగా, ఆదివారం రాత్రి 10 గంటల వరకు కౌంటింగ్ కొనసాగింది.


మోహన్‌రెడ్డి

నేడు మిలాద్ ఉన్ నబీ

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 15: ముస్లింలు పరమ పవిత్రంగా భావించే మహ్మద్ ప్రవక్త జన్మదినం అయిన మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని సోమవారం జరుపుకోనున్నారు. అల్ల యొక్క చివరి దూతగా మహ్మద్ ప్రవక్తను భావిస్తారు. ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వీధులలో భక్తి గీతాలు పాడుకుంటూ ఉత్సవాలను నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుంది. ఇస్లామిక్ క్యాలెండర్‌లో మూడవ నెల అయిన రబీ అల్ అవ్వల్‌లో ఈ మిలాద్ ఉన్ నబీ పర్వదినం వస్తుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రంలోని కచ్చ మజీద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లోని మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.




కాలూర్‌లో రూ.లక్షా46వేలకు లడ్డూ వేలం

మోపాల్, సెప్టెంబరు 15: నిజామాబాద్ రూరల్ మండలంలోని కాలూర్ గ్రామంలో ఉన్న శ్రీభవాని పుత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన లడ్డూ వేలం లక్షా 46వేల రూపాయలకు వేలంలో సుక్కబొట్ల అన్వేష్ దక్కించుకున్నాడు. గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున లడ్డూ వేలం జరగడం ఆశ్చర్యంగా ఉందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అలాగే సారంగపూర్ గ్రామంలో సార్వజన గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం 11వేల 111 రూపాయలకు గణేష్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. రూరల్ మండలంలోని కాలూర్, ఖానాపూర్, తిర్మన్‌పల్లి, గుండారం, జలాల్‌పూర్, లక్ష్మాపూర్, మల్కాపూర్, ముత్తకుంట, ధర్మారం, మల్లారం, ముబారక్‌నగర్, గూపన్‌పల్లి, కేశాపూర్, తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది.





















ప్రమాణస్వీకార మహోత్సవానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఇందల్వాయి, సెప్టెంబరు 15: పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం ప్రమాణస్వీకారం చేస్తుండటంతో ఈ కార్యక్రమానికి ఇందల్వాయి మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నారని ఆయన కరాటే మాస్టర్ నుండి పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికవడం అభినందనీయమని అన్నారు. ఇందల్వాయి మండలం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తరలివెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంగాదాస్, గంగారెడ్డి, మల్లయ్య, గంగాధర్, రాజన్న, తదితరులు ఉన్నారు.

మాక్లూర్: పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమా ణ స్వీకారోత్సవానికి ఆదివారం మాక్లూర్ మండల కాంగ్రెస్ నాయకు లు బస్సులు,కార్లలో బయలుదేరి వెళ్లారు. ఇట్టి ప్రమాణ స్వీకారోత్సవానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవిప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంక టేశ్వర్‌రావు, విండో చైర్మన్ బూరోల్ల అశోక్, ఎస్టీసెల్ నాయకుడు పీర్‌సింగ్, నా య కులు జైసింగ్, రాజు, తదితరులు తరలివెళ్లారు.

డిచ్‌పల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ ఆదివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకారణ కార్యక్ర మానికి డిచ్‌పల్లి మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు.ఈసందర్భంగా మ హేశ్ కుమార్ గౌడ్ కు శుభాకాంక్షలు తెపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షుడు పొలసాని శ్రీనివాస్ నూతన అధ్యక్షుడు మహేశ్ గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలి పిన వారిలో కాంగ్రెస్ నాయకులు సాయిప్రసాద్, బాబా, రాజేశ్వర్, వా సుబాబు, రాంచందర్‌గౌడ్, పెద్దొళ్ల శ్రీను, పులివెంకటేశ్వరరావు, బల రాం, విటల్ నాయక్, తారచంద్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, ఇబ్రహీం, నర్సారెడ్డి, దేవరాజు, గ్రామాల కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

భీమ్‌గల్: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడి బోదిరేస్వామి ఆధ్వర్యంలో ఆదివారం భీమ్‌గల్ మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండల పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య, పర్స అనంతరావు, ఏశాల కృష్ణ, అరిగెల జనార్ధన్, జెమ్స్, నల్లూరి శ్రీనివాస్; కార్యకర్తలు ఉన్నారు.

'ఎనిమిది ఫీట్ల పైన విగ్రహాలు ఉమ్మెడ బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయాలి'

ఖిల్లా, సెప్టెంబరు 15: జిల్లాలో 8 ఫీట్ల కన్నా ఎక్కువ ఎత్తున గణేష్ విగ్రహాలను ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి వద్దనే నిమజ్జనం చేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ విగ్రహాలు 8 ఫీట్ల కన్న ఎత్తు ఉంటే జాన్కంపేట, నవీపేట వద్ద రైల్వే ఎలక్ట్రికల్ లైన్ ఉన్నందువల్ల రైల్వే వారు లెవల్‌బీమ్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ తీగల కింద 8 ఫీట్ల విగ్రహాలు బాసర వెళ్లేందుకు కష్టమైనందున నందిపేట మండలం ఉమ్మెడ బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయాలని తెలిపారు.

విద్యుత్ అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు15: రానున్న గణేష్ నిమజ్జన దృష్యా భారీ వి నాయక విగ్రహాలకు విద్యుత్ వినియోగదారులకు ఏలాంటి అంత రాయం కలుగకుండా అధికారులు విద్యుత్ స్తంభాలకు మరమ్మత్తులు చేస్తున్నారు. పలు చోట్ల చిన్నగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి పెద్దవాటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీధర్, ఏఈ అశ్రితరెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, లైన్‌మెన్ ఎల్లయ్య, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీ జూనియర్ కళాశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కోటగిరి,సెప్టెంబరు 15: కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ జూనియర్ కళాశాలను ఆదివారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. కళాశాలలో డార్మెటరీ, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి అభ్యాస వాతావరణాన్ని పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మహ్మద్ మొబిన్ ఉన్నారు.

శోభాయాత్రలో డీజే నిషేధం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

ధర్పల్లి, సెప్టెంబరు 15: వినాయక శోభాయాత్ర సందర్భంగా డీజేలతో ఊరేగింపుగా తీసుకెళ్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని రామడుగు గ్రామంలో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఆయన చెప్పారు. శాంతియుతంగా గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. మండలంలో 11 రోజుల వరకు వినాయకులను ప్రతిష్ఠించిన అనంతరం నిమజ్జనానికి తరలిస్తారు. మంగళవారానికి 11 రోజులు కావడంతో పెద్దసంఖ్యలో వినాయకులను నిమజ్జనానికి తరలించే అవకాశం ఉంది. దీంతో పోలీసులు బందోబస్తుపై దృష్టి సారించారు. అన్ని గ్రామాల్లో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి తద్వారా వినాయక మండపాలకు సూచనలు అందజేస్తున్నారు. ప్రశాంతంగా నిమజ్జనం కోసం మండల ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ధర్పల్లి, సెప్టెంబరు 15: మండలంలోని రామడుగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం రామడుగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ధర్పల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు.

బీఎస్ఐ కార్యక్రమాలపై అవగాహన

ఖిల్లా, సెప్టెంబరు 15: భారతీయ ప్రమాణాల సంస్థ కార్యక్రమాలపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ అన్నారు. నిజామాబాద్‌లోని ఇందూరు కన్స్యూమర్ వెల్ఫేర్ సొసైటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వినియోగదారులకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. వినియోగదారులకు సంబంధించి 2019 రక్షణ చట్టం ప్రకారం హక్కులను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీఎస్ఐ ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. బీఎస్ఐ రూపొందించిన యాప్‌ను ప్రతీ వినియోగదారుడు తెలుసుకోవాలన్నారు.

తడపాకల్‌లో రక్తదాన శిబిరం

ఏర్గట్ల,సెప్టెంబరు 15: తడపాకల్ గ్రామంలో ఆదివారం స్పందన ఫౌండేషన్ ఆర్మూర్ వారి ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు ఇల్లేందుల నలీన్ మాట్లాడుతూ స్పందన ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ ప్రాణాధార సొసైటీ ప్రతాప్, సుమన్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద భక్తుల సందడి


నగరంలో అన్నదానం చేస్తున్న దృశ్యం


బోధన్‌లో గణేష్ మండలి వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


రుద్రూరులో ..

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 15: విఘ్నేశ్వర మాకు విఘ్నాలను తొలగించండి అని వేడుకుంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణనాథునికి ప్రీతికరమైన ఆకు పూజలు నిర్వహించి అన్నప్రసాదం అందించారు. ఆదివారం సెలవు దినం కావడంతో తొమ్మిదవ రోజున గణపతి మండపాలలో గణపతి హోమం నిర్వహించి అన్నదానాలు నిర్వహించారు. నగరంలోని సాయినగర్‌లో గణపతి హోమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందించారు. అదేవిధంగా పెద్దబజార్‌లోని మారుతి గణేష్ మండలి ఆధ్వర్యంలో ఎల్లమ్మగుట్ట శివపుత్ర గణేష్ మండలి, కెఎస్ఆర్ అపార్ట్‌మెంట్‌లో, శ్రీనగర్ కాలనీ, ఆరెకటిక ఆధ్వర్యంలో తదితర ప్రాంతాల్లో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోస్రా: మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో మహాయజ్ఞ కార్యక్రమం చేపట్టారు. పవన్ యువ శక్తి గణేష్ మండలి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో 8మంది దంపతులు, యూత్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్, చే నెంబర్ తండా, దుబ్బా గ్రామంలో పలు గణేష్ మండపాల వద్ద హోమాలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని శివాజీనగర్ కాలనీలో ఆదివారం శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండపంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్, ఈశ్వర్, మహిపాల్, రమేష్, తదితరులున్నారు.

ఎడపల్లి:మండలంలో ఆదివారం గణనాథుడి శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది. మండల కేంద్రంలోని నయాబాది కాలనీతో పాటు వడ్డాపల్లి, జానకంపేట, మంగల్‌పాడ్, ఏఆర్పీ క్యాంపు, పోచారం గ్రామాలలోని గణేష్ మండపాల నుండి గణనాథుడి శోభాయాత్ర కన్నుల పండుగగా కొనసాగింది. శోభాయాత్రలో మహిళలు, యువకుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గణనాథుడిని స్థానిక చెరువుల లో నిమజ్జనం చేశారు. శోభయాత్రలో ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వర్ని: వినాయకుడి శోభాయాత్ర సందర్భంగా ఆయా గ్రామాల్లో వినూత్న తరహాలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జలాల్‌పూర్ గ్రామంలో తొమ్మిది ఫీట్ల గరికె దండాను ప్రత్యేకంగా అలంకరించి సమర్పించారు.

రుద్రూరు:మండల కేంద్రంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో వినాయకునికి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. రుద్రూరు మండల కేంద్రంలోని శ్రీ సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ సత్యనారాయణ వ్రతం, శ్రీ లక్ష్మీ గణపతి హోమం చేశారు. ఈ సందర్భంగా మండలి ఏర్పాటై 74 ఏళ్లు అయిన సందర్భంగా వినాయకునికి 74 రకాల నైవేద్యాలను స్వామి వారికి సమర్పించి ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ హోమం లో పలువురు జంటలు కూర్చున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చిదుర వీరేశం, గెంటెల సాయిలు, పూజారి రామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

● **నవయుగ గణేష్ మండలి ఆధ్వర్యంలో**

రుదూరు మండల కేంద్రంలోని అంగడి బజార్ నవయుగ గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయకునికి 108 వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వేల్పూర్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో ఆదివారం గణేష్ మండపం వద్ద అన్న దానం నిర్వహించారు. అంతకు ముందు మండపం వద్ద గణపతికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండపాల నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

● **వేల్పూర్ వీడీసీ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేల్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల డెకరేషన్ ఉత్తమ డెకరేషన్ చేసిన పలు గణేష్ మండపాలను స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించి ఎంపిక చేశారు. వేల్పూర్ మండల కేంద్రంలో అయోధ్యలో రామాలయంలో నిర్మించిన బాలరామాయణం దాని ప్రకారం డెకరేషన్ చేసిన మండపాన్ని ప్రథమ బహుమతిగా ఎంపిక చేసి మిగతా మండపాలకు ద్వితీయ, తృతీయ మండపాలను ఎంపిక చేసి గ్రా మాభివృద్ధి కమిటీ సభ్యులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: యువత భక్తి భావంతో పాటు గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సాలూర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూమయ్య అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీసాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తిభావంతో విఘ్నేశ్వరుడికి పూజలు జరుపుకుని ఆయన ఆశీస్సులు పొందాలన్నారు. అన్నదాన కార్యక్రమంలో సంగెపు దత్తు, సున్నపు రాజు, శివగణేష్ మండలి సభ్యులు తదితరులున్నారు.

నిజామాబాద్ కల్చరల్:నగర శివారులోని ముబారక్‌నగర్ ప్రాంతంలో శుభక్తి గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వరుసగా 18వ సంవత్సరం వినాయకుడిని ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గణేష్ మండలి అధ్యక్షుడు మోగ్లీ, ఉపాధ్యక్షుడు పవన్‌లు తెలిపారు. ప్రతీరోజు భజన కార్యక్రమాలతో పాటు హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధర్పల్లి:మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక నిమజ్జనం కోసం వినాయకులను శోభాయాత్రగా తరలిస్తున్నారు. ఆదివారం 9 రోజులు కావడంతో కొన్ని మండపాల వారు వినాయకులను భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఆయా గ్రామాల్లో శోభాయాత్రను ప్రధాన వీధుల్లో నిర్వహించి గ్రామ శివారులోగల చెరువుల్లో నిమజ్జనానికి తరలిస్తున్నారు. మండల కేంద్రంలో శోభాయాత్రకు సంబంధించి గ్రామాభివృద్ధి కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గుంతలమయంగా ఉన్న రోడ్లను మొరంతో మరమ్మతులు చేశారు. నిమజ్జనం కోసం ప్రత్యేక క్రేన్‌లు ఏర్పాటు చేశారు.


అంక్సాపూర్‌లో గణేష్ మండపం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


పూజలందుకుంటున్న గణనాథుడు


నవీపేటలోని తడగామలో గణేష్ శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎస్సై

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం గణేష్ నిమజ్జనం నిర్వహించారు. మండల కేంద్రంలోని తడగామతో పాటు నాళేశ్వర్, జన్నేపల్లి, కోస్లీ, కమలాపూర్, అభంగపట్నం, అబ్బాపూర్(ఎం), నందిగామ తదితర గ్రామాలలో వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక రథాలను అందంగా అలంకరించి గ్రామాలలో శోభాయాత్ర నిర్వహించారు. వినాయక నిమజ్జనం చేయగా భారీ సైజు వినాయక విగ్రహాలను యంచ గోదావరిలో నిమజ్జనం చేశారు.

● **యంచ గోదావరి వద్ద నిమజ్జన ఏర్పాట్లు**

మండలంలోని యంచగోదావరి వద్ద గణేష్ నిమజ్జనానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఫ్లగ్ లైట్లతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనానికి భారీ క్రేన్‌లను సైతం అందుబాటులో ఉంచారు. ముందు జాగ్రత్త చర్యగా గజ ఈతగాళ్లను సిద్దంగా ఉంచారు.

రూ.60 వేలు సాయమందించిన పూర్వవిద్యార్థులు

వర్ని,సెప్టెంబర్ 15: అయిన వాళ్లను కోల్పోయి పుట్టెడు దుఃఖంతో ఉన్న తోటి విద్యార్థులకు సహాయంగా నిలిచారు సాటి విద్యార్థులు. పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు ఆపదలో ఉండే సాటి విద్యార్థులకు ఆపన్న హస్తం అందించేందుకు శ్రీకారం చుట్టారు. తగిలేపల్లి గ్రామంలో బి.సిద్ధి రాములు, గైని రాములు కుటుంబాలతో పాటు సత్యనారాయణ పురంకు చెందిన వేగుల వినోద్ కుమార్ కుటుంబాలకు రూ.20వేల చొప్పున ఆర్థిక సహాయంను అందజేశారు. దీంతో తోటి విద్యార్థుల సహాయంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బానోత్ రమేష్, మొబెల్ శ్రీను, వడ్ల భాస్కర్, దడ్ల రాజు, గైని గోపి, కేతావత్ భీమా, శ్రీను, సాధక్, సోన్ కాంబ్లె, గుజ్జ రవీందర్, గుజ్జ సాయిలు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెట్టొద్దు'

బోధన్‌రూరల్,సెప్టెంబరు 15: ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్యన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చిచ్చుపెట్టే విధంగా మాట్లాడడం సరికాదని నిజామాబాద్ పార్లమెంట్ తెలుగు యువత బోధన్ ఇన్‌చార్జి ఎత్తొండ రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన బోధన్‌లో మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యవహార శైలిపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టవద్దన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరు కలిసిమెలిసి ఉంటారని ఇది ఆయన గుర్తు ఉంచుకోవాలన్నారు. మరోమారు రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టేప్రయత్నం చేయవద్దన్నారు.

కామారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 15:కామారెడ్డి పట్టణంలో జరిగే వినాయక నవరాత్రి నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11గంటల నుంచి బుధవారం ఉదయం 9 గంటలవరకు పట్టణంలోనిస్టేషన్‌రోడ్డు, సిరిసిల్లరోడ్డు, సుభాష్‌రోడ్డు, పెద్దబజార్, పాంచ్‌రాస్తా, వీక్లిమార్కెట్, జేపీఎన్‌రోడ్డు,తిలక్‌రోడ్డులలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని తెలిపారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి స్టేషన్‌రోడ్డు వైపుకు భారీ వాహనాలు, చిన్నవాహనాలు అవసరాన్ని బట్టి మాత్రమే వారి నివాసాలకు వెళ్లె విధంగా అనుమతించబడుతాయని తెలిపారు. సిరిసిల్లరోడ్డునుండి మాచారెడ్డివైపు వెళ్లెవాహనాలను,సిరిసిల్లరోడ్డుబ్రిడ్జి వద్ద ఎన్‌హెచ్ 44 వైపుకు మళ్లించబడునని తెలిపారు.రామారెడ్డి, గర్గుల్ నుండి వచ్చేవాహనాలను గుమస్తాకాలనీ వద్ద జిల్లా పోలీసుకార్యాలయం వైపు, అశోక్‌నగర్ రైల్వేగేటు వద్ద నుండి పట్టణంలోపలికి వచ్చే వాహనాలను కొత్తబస్టాండ్ వైపుకు మళ్లించబడునని తెలిపారు. ఆర్టీసీ బస్సులను కొత్తబస్టాండ్ వద్ద మాత్రమే అనుమతించబడునని ప్రయాణికులు వారి ప్రయాణాలను కొత్తబస్టాండ్ నుంచి మాత్రమే కొనసాగించాలని తెలిపారు.

కన్నుల పండుగగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 15: మండలంలోని ధర్మారం గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం శ్రావణ నక్షత్ర సందర్భంగా స్వామి వారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది.ఈ సందర్భంగా అర్చకుడు రాహుల్ త్రిపాటి, కల్యాణ కార్యక్రమం నిర్వహించారు.

మండపాల్లో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 15: పట్టణంలోని పలు గణేష్ మండపాల వద్ద అన్నదానం, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథునికి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అలాగే మండపంలో గణేష్‌కు ప్రత్యేక పూజలతో పాటు మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. విశ్వసేన, రుద్రసైని, యోగేశ్వర కాలనీలోని దాస ఆంజనేయ శివఅన్నపూర్ణ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులదే

● **సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు**

బోధన్‌రూరల్,సెప్టెంబరు 15: తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులదేనని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాయుధ పోరాట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారన్నారు. ఆయన జీవితంతం భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశారన్నారు. పుట్టింది బ్రాహ్మణ కులమైన దేశంలోని నిరుపేదల ప్రజల కోసం, కార్మిక వర్గ సంక్షేమం కోసం సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసి తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటం చారిత్రాత్మకం అన్నారు. పోరాడితే పోయేది బానిస సంకెళ్లేనని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే తప్ప ఎవరు కారని స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలపై పోరాడాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, గంగాధరప్ప, జంగం గంగాధర్, నన్నేసాబ్, నాగేశ్వర్, సిర్ప లింగం, దాసు, గోపి, పత్రి ఎల్లయ్య, షేక్.నజీర్, పోశెట్టి, ప్రసాద్, సత్యనారాయణ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పోరాట ఫలితమే హైదరాబాద్ సంస్థానం విలీనం

కోటగిరి,సెప్టెంబర్ 15: కమ్యూనిస్టుల త్యాగాల ఫలితమే నాటి హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయిందని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులకు జోహర్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుండి 17వ తేది వరకు అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ 76వ వార్షికోత్సవ సభలను నిర్వహిస్తున్నామన్నారు. నాటి నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ జరిగిన పోరాటంలో ఎందరో అమరులయ్యారన్నారు. వారి త్యాగాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 17వ తేదిన భారత దేశంలో తెలంగాణ ప్రాంతం విలీనాన్ని అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు విఠల్ గౌడ్, గంగాధర్, సునీల్, రాములు, శరత్, హన్మాండ్లు, సంజీవ్, నాగేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'బహుజన శ్రామిక జాతుల గౌరవదినంగా జరుపుకోవాలి'

ఖిల్లా, సెప్టెంబరు 15: సెప్టెంబర్ 17న బహుజన శ్రామిక జాతుల స్వయం గౌరవ రాజ్యాధికార సాధన దినోత్సవంగా జరుపుకోవాలని బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దండి వెంకట్ కోరారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోరాటంలో బహుజన శ్రామిక జాతుల వారు పాల్గొన్నారని అన్నారు. వారందరిని స్మరించుకుంటూ కార్యక్రమాన్ని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సబ్బని లత, సాయి కాంబ్లె, గీతాంజలి, దండు జ్యోతి, టి.రాజు, ఆశాబాయి, చంద్రగౌడ్, గంగాధర్ వాగ్మారే తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో గణేష్ నిమజ్జనం

● **అధికారుల తీరుపై భక్తుల అసహనం**


చీకట్లో గణేష్ నిమజ్జనం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు15: పట్టణంలోని గూండ్ల చెరువు ప్రాంతంలో భక్తులు చీకట్లో గణేష్ నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు గణనాథునికి పూజలు చేసి ఆదివారం రాత్రి నిమజ్జనం చేయగా గూండ్ల చెరువు వద్ద అధికారులు విద్యుల్ లైట్లు ఏర్పాటు చేయకపోవడం ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గణేష్ మండపాల వారు ఇళ్ళ నుంచి చార్జింగ్ లైట్‌లను తీసుకువచ్చి గణేష్ నిమజ్జనం పూర్తిచేస్తున్నారు. గణేష్ నిమజ్జనం తొమ్మిది రోజులకు, పదకొండు రోజులకు చేస్తారు. పలువురు గల్లీలో ఏర్పాటు చేసుకున్న గణనాథులను తొమ్మిది రోజులకు గణేష్ నిమజ్జనం చేశారు. అధికారులు నిమజ్జన ఏర్పాట్లును ముందుగా చేయాల్సింది పోయి ప్రధాన రోడ్డు నుంచి గూండ్ల చెరువు వరకు వచ్చే రోడ్డులో విద్యుత్ స్తంబాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో పాటు నిమజ్జన ప్రదేశంలో ఒక్క లైట్ ఏర్పాటు చేయలేదు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పదోతరగతి విద్యార్థులతో 'విజయస్ఫూర్తి'

పెర్కిట్,, సెప్టెంబరు15: ఆర్మూర్ మండల ప్రైవేటు పాఠశాలల ఆధ్వ ర్యంలో ఆదివారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో జీఆర్ గార్డెన్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యకరమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్‌పర్సన్, టెస్ట్ బుక్ రైటర్ చక్రవర్తుల శ్రీనివాస్, శశికళధర్, గౌస్‌పాషా ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లోని మేళకువలు, మానసికంగా, దృఢంగా ఉండాలంటే జీవన విధానం ఏలా ఉండలో అవగాహన కల్పించారు.

విద్యార్థుల తల్లులకు క్రీడా పోటీలు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు15: ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో ఆదివారం మాతృమూర్తుల సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం వారికి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృ మూర్తులను ఉల్లాసపర్చడానికి త్రోబాల్, సోలో డ్యాన్స్, బాంబ్ ఇండసిటీ, తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ కవిత దివాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యార్థుల మాతృమూర్తులకు అవగాహన పెంచడానికి, పిల్లల చదువు, క్రమశిక్షణ, వారి అభివృద్ధి, పరీక్ష విధానంపై సందేహాలను తీర్చి తగిన సూచనలను, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రెడ్డి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ముత్యంపేట గ్రామస్తులు

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నాయకులు

దోమకొండ, సెప్టెంబరు 15: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి దోమకొండ మండలంలోని ఆయా గ్రామాల నుంచి రెడ్డి సోదరులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ముత్యంపేట గ్రామానికి చెందిన మెరుగు రవీందర్‌రెడ్డి తన వంతుగారెడ్డి సామాజికవర్గంలో వెనకబడిన వారి పిల్లల హాస్టల్ నిర్మాణానికి రాజబహదూర్ వెంకట్రామ్‌రెడ్డి విద్యాపరిషత్ ట్రస్ట్ కమిటీ వారికి రూ.5 లక్షల విరాళం ప్రకటించినట్లు ఆయన తెలిపారు. తరలివెళ్లిన వారిలో పన్యాల రాంమోహన్‌రెడ్డి, కాటేపల్లి నిరంజన్ రెడ్డి, రుపేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నర్సారెడ్డి, సంజీవరెడ్డి, మాల్లారెడ్డి,వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.



రిటైర్డ్ ఆర్మీ జవాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లకు సన్మానం

భిక్కనూరు, సెప్టెంబరు 15 : భిక్కనూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్లు డి.శ్రీనివాస్, ప్రవీణ్, డి.ప్రేమ్‌కుమార్‌ను ఆదివారం మినీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువకులు ఇటీవల కాలంలో ఆర్మీలో చేరి దేశ సేవ చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆర్మీ, పోలీసు శాఖలో చేరేందుకు పట్టుదలతో ముందుకు సాగుతున్న యువతకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాయి కుమార్, న్యాయవాదులు గజ్జెట భిక్షపతి, శ్రీధర్, రాజా బాబుగౌడ్, మినియూత్‌క్లబ్ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న దృశ్యం

'మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి'

బీర్కూర్, సెప్టెంబరు 15 : బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సింగని స్వప్న అనే మహిళకు ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యులు కుట్టు మిషన్‌ను అందజేశారు. తనవంతుగా మహిళలకు చేయూతను అందించేందుక కృషిచేస్తామని సభ్యులు అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గాలయ్య, అవారి గంగారాం, సభ్యులు కందుకుర్తి సంతోష్, రషీద్, కిషోర్, విఠల్, సంతోష్, పోశెట్టి, భూషణ్, క్యాకప్ప, విజయ్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

17న భిక్కనూరులో అనంత చతుర్దశి వేడుకలు

భిక్కనూరు, సెప్టెంబరు 15: మండలకేంద్రంలోని పోస్టాఫీసు సమీపంలో కొలువుదీరిన శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో మంగళవారం అనంత చతుర్దశి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అనంత చతుర్దశి వేడుకలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా సిద్దిపేట, మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అనంత కోటివత్తులను ఆలయ ప్రాంగణంలో వెలిగించి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.



ముస్తాబైన భిక్కనూరులోని అనంతపద్మనాభస్వామి ఆలయం

ముత్యంపేట జీపీలో నిరుపయోగంగా బాడీఫ్రీజర్

దోమకొండ, సెప్టెంబరు 15: మండలంలోని ముత్యంపేట గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాడి ఫ్రీజర్ నిరుపయోగంగా ఉంది. గతంలో గ్రామానికి చెందిన సేవా సమితి సభ్యులు దాతగా నిలిచి గ్రామ పంచాయతీకి అందజేశారు. కానీ పంచాయతీకి సంబంధించిన సిబ్బంది దానిని పట్టించుకోవడం లేదని ముత్యంపేటసేవా సమితి సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిరోజుల నుంచి గ్రామంలో మృతిచెందిన వ్యక్తులకు గ్రామానికి చెందిన బాడిఫ్రీజర్ ఉపయోగంలో లేకపోవడంతో ఇతర గ్రామాల నుంచి సుమారు రూ.3వేల వరకు ఖర్చు వస్తుందని గ్రామస్తులు తెలిపారు. మూడురోజుల క్రితం ఇద్దరు యువకులు కామారెడ్డికి పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా భవానిపేట్ స్టేజీ వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతిచెందారు. అక్కడి నుంచి డెడ్‌బాడి తెచ్చాక గ్రామంలో బాడిఫ్రీజర్‌లో పెట్టేందుకు అందుబాటులో లేక దోమకొండ నుంచి బాడిఫ్రీజర్‌ను కిరాయికి తెచ్చుకున్నారు. ముత్యంపేట సేవా సమితి దాతలు అందించిన బాడిఫ్రీజర్‌ను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా జీపీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ముత్యంపేట జీపీలో నిరుపయోగంగా ఉన్న బాడిఫ్రీజర్

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

మద్నూర్, సెప్టెంబరు 15 : ఉమ్మడి మద్నూర్ మండలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వినాయక చవితిని పురస్కరించుకుని 11 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల నేపథ్యంలో ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠింపబడిన వినాయక మండపాల్లో గణేశుడికి ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. అన్నప్రసాద కార్యక్రమాలతో పాటు భజన, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భజన, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పెదతడుగూర్ గ్రామంలోని సార్వజనిక్ గణేష్ మండపం వద్ద వార్కారీ సాంప్రదాయం ప్రకారం భజన కార్యక్రమాలను నిర్వహించారు. మద్నూర్ మండల కేంద్రంలోని షేత్ కారి గణేష్ మండపం వద్ద భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని పలు గణేష్ మండపాల వద్ద మహిళలు కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఆయా మండపాల వద్ద భక్తులకు ఆకట్టుకునే విధంగా గణేష్ మండపాలను తీర్చిదిద్దారు. ఈ సారి మండల గణేష్ ఉత్సవ సమితి ఆదేశాల మేరకు మండపాల వద్ద అశ్లీలమైన డ్యాన్సులు, పాటలు పెట్టకుండా భక్తిశ్రద్దలతో కూడుకున్న పాటలు పెట్టడం వల్ల రోజురోజుకు భక్తులసంఖ్య పెరుగుతున్నట్లు మండప నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా మరోరెండు రోజుల పాటు కార్య క్రమా లు కొనసాగుతాయన్నారు.



వినాయక మండపాల వద్ద అన్నప్రసాద కార్యక్రమం

వినాయక మండపం వద్ద అన్నదానం



దోమకొండలో శివపుత్ర వినాయక మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దోమకొండ, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని అంగడి బజార్ రోడ్డులో శివపుత్ర వినాయక మండపం వద్ద ఆదివారం గజవాడ శ్రీకాంత్ దంపతులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పెద్దఎత్తున భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వివిధ గ్రామాల్లోని వినాయక మండపాల్లో తోమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహించిన సంఘాల సభ్యులు యువజన సభ్యులు వాహనాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి అందంగా అలంకరించి ఆదివారం నిమజ్జనం ప్రారంభించారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల వినాయక మండపాల సభ్యులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు...



కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 15: 9 రోజులుగా పూజలు అందుకున్న వినాయకుని నిమజ్జన కార్యక్రమం రానే వచ్చింది. దీంతో ఆదివారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు కుంకుమపూజ కార్యక్రమాలు నిర్వహించారు. కామారెడ్డి ముదాంగల్లిలో మన అడ్డ యూత్ సభ్యులు కుంకుమపూజలు నిర్వహించగా, బీసీసీ యూత్ సభ్యులు అన్నదానం చేశారు.అలాగే పలుచోట్ల హోమకార్యక్రమాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. వార్డులలో చిన్నారులు ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

ఘనంగా కొనసాగిన నిమజ్జన ఉత్సవాలు



నిమజ్జనానికి గణనాథులను తరలిస్తున్న దృశ్యం

రామారెడ్డి, సెప్టెంబరు 15:రామారెడ్డి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో గణేష్‌నిమజ్జన ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తి పాటలు, నృత్యాలు చేస్తు అంగరంగవైభవంగా విద్యార్థులు, యువకులు మహిళలు నిమజ్జన కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తాడ్వాయి :మండలంలోని కరడ్‌పల్లి,కన్కల్,దేమికలాన్ గ్రామాలలో ప్రశాంతంగా గణేష్‌నిమజ్జన శోభాయాత్రను నిర్వహించారు. 9 రోజుల పాటు భక్తి శ్రద్దలతో వినాయకుని పూజించి ఘనంగా ఆయా గ్రామాల చెరువులలో నిమజ్జనం చేశారు.

భిక్కనూరులో...

భిక్కనూరు, సెప్టెంబరు 15 : మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోంది. ఆదివారం తోమ్మిది రోజుల పాటు ఆయాగ్రామాల్లో పూజలందుకున్న గననాథుడిని గణేష్‌మండప నిర్వాహకులు, ఆయా పాఠశాలల సిబ్బంది ప్రత్యే కంగా అలంకరించిన వాహనాలలో పెట్టి బ్యాండ్ చప్పుళ్ల, సౌండ్‌బాక్స్‌ల నడుమ నృత్యాలు చేస్తూ ప్రధాన వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయాగ్రా మాల్లోని చెరువులు, కుంటల్లోగణనాథులను నిమజ్జనం చేశారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్సై

మద్నూర్, సెప్టెంబరు 15 : వినాయక నిమజ్జనంలో భాగంగా మంగళవారం ఊరేగింపు కార్యక్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని మద్నూర్ ఎస్సై విజయ్‌కొండ వినాయక మండపాల కార్యకర్తలకు సూచించారు. ఈనెల 17న మద్నూర్ మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో నిమజ్జన కార్యక్రమాలు ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుర్తుచేశారు. ఎలాంటి అవరోధాలు లేకుండా అపశ్రుతులు కలుగకుండా నిమజ్జనాలు జరిగేలా ఉత్సవ సమితి సభ్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులో ప్రమాదకరమైన నృత్యాలు చేయవద్దని, డీజేలకు అతి దగ్గరగా ఉండకూడదని, భారీ శబ్దంతో గుండె లయ తప్పే ప్రమాదం ఉందని, మార్గమధ్యలో రహదా రికి అడ్డంగా కిందికి వేలాడుతూ ఉండే విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంటుందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యం, మత్తు పదార్థాల జోలికి వెళ్లోద్దని, గొడవలకు తావి వ్వోద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.

వినాయకుడి లడ్డు వేలం పాట

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 15 : ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో ఉన్న దేవునిపల్లిలో కాపు పరివార్ గణేష్ మండపం వద్ద తొమ్మిది రోజులు వివిధ రకాల పూజలు అందుకున్న వినాయకుడి లడ్డూ ప్రసాదంకు శనివారం వేలం పాట నిర్వహించారు. వేలంపాటలో అదే కాలనీకి చెందిన నాగం చిరంజీవులు దంపతుల వేలం పాటలో పాల్గొని రూ.41,111లకు లడ్డూను దక్కించుకున్నారు. వారి దంపతులకు గణేష్ మండలి సభ్యులందరూ సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారికి ఏళ్ళవేళలా గణేషుని ఆశీర్వాదం ఉండాలని గణేష్ మండలి సభ్యులు కోరినట్లు తెలిపాఇరు. ఆదివారం నిమజ్జనం చేశారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, సెప్టెంబరు 15: నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామశివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరినకోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ ప్రాం గణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

గాంధీ భవన్ తరలిన ఎల్లారెడ్డి గౌడ సంఘం నాయకులు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 15 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేష్‌కుమార్‌గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు ప్రమాణ స్వీకారంకు ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘం నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, గౌడ సంఘం నేతలు శ్రీనివాస్‌గౌడ్, సాయిరాంగౌడ్, రామాగౌడ్ ఉన్నారు.



గాంధీభవన్‌కు తరలిన నాయకులు

'ప్రతీ పట్టభద్రుడు పేరును ఎన్‌రోల్‌చేసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 15: ప్రతి పట్టభద్రుడు తన పేరును ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని పట్టభద్ర ఎమ్మెల్సీ పోటీదారు ఆల్‌ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అమృతగ్రాండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇప్పటివరకు సరైన న్యాయం చేసిన ఎమ్మెల్సీలు ఎవరు లేరని అన్నారు. త్వరలో జరగబోయే కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీచేస్తున్నందున తనకు మద్దతు పలకాలని కోరారు. ప్రతి నిరుద్యోగి కోసం తాను పోరాటం చేసి జాబ్‌క్యాలెండర్ పక్కాగా అమలు అయ్యేలా చూస్తానని తెలిపారు. గత ఎన్నికలలో 6 లక్షలకు పైగా పట్టభద్రులు ఉంటే కేవలం లక్షా 20 వేల మంది మాత్రమే ఎన్‌రోల్‌చేసుకున్నారని అన్నారు. ప్రస్తుతం ప్రతి పట్టభద్రుడు ఎన్‌రోల్ చేసుకోవాలని అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈనెల 31 నుంచి డిసెంబర్ 6 వరకు కొనసాగే ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను ప్రతి పట్టభద్రుడు వినియోగించుకోవాలని తెలిపారు.

ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా



బీర్కూర్‌లో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

బీర్కూర్, సెప్టెంబరు 15 : బీర్కూర్ మండల కేంద్రంలోని కుమ్మరిగల్లీ, వైఎస్ఆర్ కాలనీలలో గత పదిహేను రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీ బిందెలతో మహిళలు ఆందోళనలు చేపట్టడంతో గ్రామ పంచాయితీ కార్యదర్శి గంగారాం ఎట్టకేలకు స్పందించారు. వెంటనే గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా ఆ రెండు కాలనీలకు నీటిని సరఫరా చేయించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ మర్మతులు అయ్యే వరకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

రోడ్ల గుంతలు పూడ్చివేత



గుంతలు పూడ్చివేయిస్తున్న చైర్‌పర్సన్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 15:కామారెడ్డి మున్సిపల్ పరిధిలో రెండురోజుల పాటు కొనసాగనున్న నిమజ్జనశోభాయాత్ర రూట్‌లలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేయించినట్లు చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రూట్ మ్యాప్ ప్రాంతాలను పరిశీలించి దగ్గరుండి గుంతలను పూడ్చివేయించారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు పిట్ల వేణుగోపాల్, హనుమండ్ల మానస సురేష్,శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్,జవాన్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తాడ్వాయి, సెప్టెంబరు 15:యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల యోగ సభ్యులు అన్నారు. ఆదివారం యోగసెంటర్‌లో యోగగురువు గంగారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్యాంరావు, గంగారెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

గాంధారి, సెప్టెంబరు 15:గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి పలువురిని అరెస్ట్‌చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. జవాన్ యూత్ గణేష్ మండపం వద్ద కాశీరాం,సందీప్,ఆంజనేయులు, సాయిరాం, సంతోష్, పాపయ్యలను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1910లను,మిత్రయూత్ గణేష్ మండపం వద్ద పేకాట ఆడుతున్న బైరి సంగయ్య,రాజేందర్, కాషాగౌడ్, కాశీరం, సంతోష్,రాజేందర్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.27,550లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిష్టాపూర్‌లో...

బీర్కూర్, సెప్టెంబరు 15 : బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామ పరిధిలో రహస్య ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శనివారం రాత్రి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 2 వేల 790 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన బీబీ పాటిల్

మద్నూర్, సెప్టెంబరు 15 : మద్నూర్ మాజీసర్పంచ్ వేద్ ప్రకాష్ పటేల్‌ను జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు పరామర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని మాజీసర్పంచ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఉన్న సర్పంచ్‌కు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు వెటర్నరీ డాక్టర్ బండి విజయ్, బీజేపీ నాయకులు కృష్ణపటేల్, తుకారం, సంతోష్, అనిల్ పటేల్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	- సరిపోదా శనివారం
దర్శన్	- ఏఆర్ఎమ్
ప్రియా 35	- మత్తు వదలరా-2

బాన్సువాడ	
మహేశ్వరి	- శంకర్‌దాదా ఎంబీబీఎస్
వెంకటేశ్వర	- మత్తు వదలరా 2

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190